


- జిల్లాలో పెరిగిన ఏసీబీ దాడులు
- పోలీసుశాఖతో పాటు పలు శాఖలపై ఏసీబీ నిఘా
- పక్షం రోజుల్లోనే రెండుచోట్ల ఏసీబీ దాడులు
- వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్న పోలీసులు
- తాజాగా కోర్టు ఆవరణలో లంచం తీసుకున్న కానిస్టేబుల్
- కానిస్టేబుల్‌తోపాటు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెస్ట్
- ఏసీబీ చరిత్రలోనే తొలిసారి కోర్టు ఆవరణలో అధికారుల దాడి

మారని తీరు.. అవే వసూళ్లు!





కామారెడ్డి, మే23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు శాఖతోపాటు పలు ప్రభుత్వ శాఖలలో అవినీతి రాజ్యమేలుతోంది. రూ.వేలు, లక్షలు.. జీతాలు పొందుతున్నా చేయి తడపనిదే పనికాదనే రీతిలో కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. ఏసీబీకి పట్టుబడుతున్న వారిని చూస్తున్న కొందరు తమ పద్ధతిని మార్చుకోవడం లేదు. పైగా కొత్త తరహాలో మధ్యవర్తులు ఇతరత్రా మార్గాలలో లంచాలు తీసుకుంటున్నారు. ఇది వారికి అదనపు ఆదాయం అయిన సామాన్యులకు మాత్రం శాపంగా మారుతోంది. ప్రధానంగా పోలీసుశాఖలో పలువురు అధికారులు, సిబ్బంది పనితీరుపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే ఏసీబీ పోలీసు శాఖపైనే నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. పక్షం రోజుల్లోనే రెండుచోట్ల ఏసీబీ అధికారులు దాడులు చేయడం ప్రభుత్వ వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రధానంగా ఏసీబీ దాడుల్లో పోలీసుశాఖకు చెందిన ఓ ఇద్దరు ఎస్సైలతో పాటు మరో ఇద్దరు సిబ్బంది లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మరో పోలీసుస్టేషన్‌లోని ఓ అధికారి, సిబ్బందిపై ఏసీబీ ఇటీవల విచారణ చేపట్టిన విషయం తెలిసిందే.

ఏసీబీ చరిత్రలోనే తొలిసారి

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏసీబీ చరిత్రలోనే మొదటిసారిగా కోర్టు ఆవరణలోనే లంచం తీసుకుంటుండగా ఓ కానిస్టేబుల్‌తో పాటు ఏపీపీ (అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్)ను పట్టుకున్న సంఘటన కామారెడ్డి కోర్టులో శుక్రవారం చోటుచేసుకుంది. కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌కు నిమ్మసంజయ్ కోర్టు కేసుల బాధ్యతలను అప్పగించారు. అయితే పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసు కామారెడ్డి కోర్టుకు వచ్చింది. ఆ కేసు విషయంలో అనుకులంగా చేస్తామని నిందితుడితో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం నాయక్, కానిస్టేబుల్ సంజయ్‌లు ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు నిందితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు నేరుగా కామారెడ్డి కోర్టులోనే నిఘా పెట్టి నిందితుడు కానిస్టేబుల్‌కు రూ.10వేలు లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు కానిస్టేబుల్‌ను విచారించగా ఇందులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాత్రకూడా ఉందని వెల్లడించారు. దీంతో ఏసీబీ అధికారులు ఇరువురిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేశారు.

పక్షం రోజుల్లోనే రెండుచోట్ల దాడులు

ఏసీబీ జిల్లాలో ప్రధానంగా పోలీసు శాఖపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. పక్షం రోజుల వ్యవధిలోనే ఏసీబీ అధికారులు ఓ పోలీసు స్టేషన్‌లో విచారణ చేపట్టగా తాజాగా కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ పట్టుబడడం ఇందుకు నిదర్శనం. ప్రతీ కేసుకు కొందరు పోలీసులు రేటులను ఫిక్స్‌చేసి వసూళ్ల చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. చేయి తడిపితే కాని కేసుల ఫైళ్ల ముందుకు కదలడం లేదు. కొన్ని సందర్భాల్లో కొందరు పోలీసులు బహిరంగంగానే వసూళ్ల గురించి మాట్లాడుకోవడం గమనార్హం. డబ్బు సంపాదించాలనే భావనతో ముందు వెనుక చూసుకోకుండా వసూళ్లకు పాల్పడుతున్నారనే వాదన పోలీసు వర్గాల్లో వినిపిస్తోంది. ప్రతీఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాయి. అన్నిచోట్ల ఏసీబీ అధికారుల నంబర్లు దొరుకుతున్నాయి.

ప్రభుత్వ అధికారులు, సిబ్బంది డబ్బుల కోసం ఇబ్బందులు పెడితే చాలు ప్రజలు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కుతుండడంతో పోలీసు శాఖ అప్రతిష్ట పాలవుతోంది.

నాలుగు నెలల్లో నలుగురు

జిల్లాలో గత నాలుగు నెలల కాలంలో పోలీసుశాఖకు చెందిన నలుగురు ఏసీబీకి పట్టుబడ్డారు. గత నాలుగు నెలల క్రితం లింగంపేట ఎస్సై అరుణ్‌కుమార్, రైటర్ రామస్వామిలు ఓ నిందితునికి స్టేషన్ బెయిల్ విషయంలో రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన జరిగి నెలరోజుల గడకవ ముందే అదే పోలీసుస్టేషన్‌కు చెందిన ఎస్సై సుధాకర్ నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఓ చీటింగ్ కేసులో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.12500 లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. తాజాగా కోర్టు కేసులో ఓ కానిస్టేబుల్ రూ.10వేలు లంచం

(తరువాయి 8వ పేజీలో..)





లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏపీపీ (తెల్ల చొక్కా)తో పాటు కోర్టు కానిస్టేబుల్

ఏసీబీ వలలో ఏపీపీ, కోర్టు కానిస్టేబుల్

- పట్టణ పోలీసుస్టేషన్‌లోని ఓ కేసు విషయంలో రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్
- డబ్బు ఇవ్వలేనని ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.10వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

కామారెడ్డి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలలో జిల్లా కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్యాసిక్యూటర్ గుగులోత్ అశోక్ శివరామ్‌నాయక్, కోర్టు కానిస్టేబుల్ నిమ్మ సంజయ్ చిక్కారు. ఓ కేసులో దోషిని తప్పించేందుకు లంచం తీసుకుంటూ కోర్టు కానిస్టేబుల్ నిమ్మ సంజయ్ శుక్రవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. డబ్బుల డిమాండ్ విషయంలో ఏపీపీ అశోక్ శివరాంనాయక్ పాత్ర ఉండడంతో అతనిని సైతం ఏసీబీ అధికారులు అదుపులో తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన ఓ కేసు విషయంలో జిల్లా కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా పనిచేస్తున్న గుగులోత్ అశోక్ శివరామ్‌నాయక్, పట్టణ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుల్ నిమ్మ సంజయ్ మధ్యవర్తిత్వం ద్వారా ఓ కేసులో నిర్దోషిగా విడుదల చేయడానికి బాధితుడి వద్ద రూ.15వేలు డిమాండ్ చేశాడని తెలిపారు. ఆ తర్వాత రూ.15వేల నుంచి రూ.10వేలకు డబ్బులను తగ్గించారని అన్నారు. అయితే డబ్బులు ఇచ్చుకోలేని పరిస్థితిలో ఉన్న బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో కానిస్టేబుల్ నిమ్మ సంజయ్ రూ.10వేలు బాధితుడి వద్ద నుంచి తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తెలిపారు. కానిస్టేబుల్ సంజయ్‌ను విచారించగా.. డబ్బుల డిమాండ్ విషయంలో ఏపీపీ అశోక్ శివరాంనాయక్ పాత్ర ఉన్నట్లు వెల్లడించాడని తెలిపారు. దీంతో ఏపీపీతోపాటు, కోర్టు కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరుచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

గ్రామపాలన ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

కామారెడ్డిటౌన్, మే23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న జరుగనున్న గ్రామ పాలన ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామ పాలన అధికారుల ఎంపిక నిర్వహణపై ఇన్విజిలేటర్స్, పలువురు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 402 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలుగా పని చేసిన వారు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాటు ఫొటో కలిగిన గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. పరీక్ష జరుగు సమయంలో విద్యుత్ అంతరాయం జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఉదయం 9.30గంటలకు అభ్యర్థులను హాల్‌లోకి అనుమతిస్తామని, 10గంటలకు మెయిన్‌గేటు మూసి వేస్తామని, 10.25కు ప్రశ్నాపత్రాల అందజేస్తారని, 10.30కు పరీక్షను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్‌పీ చైతన్యరెడ్డి, ఆర్‌డీఓ వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, పరిశీలకుడు శంకర్, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను ప్రారంభించాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం లింగాపూర్‌లో కుంట్ల వినోదకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పత్రాన్ని అందించి భూమి పూజ చేసి నిర్మాణపనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మంజూరైన ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటివరకు 708 ఇళ్లు మంజూరు కాగా 74 ఇళ్లకు మార్కవుట్ ఇచ్చామన్నారు. జిల్లావ్యాప్తం గా రెండు విడుతల్లో 11,153 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందు లో కామారెడ్డి నియోజకవర్గంలో 3206 ఇళ్లు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 3496, జుక్కల్ నియోజకవర్గంలో 3019, బాన్సువాడ నియోజకవర్గంలో 1432 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందులో 2250 ఇళ్ల నిర్మాణాలు పలు దశల్లో ఉన్నాయని తెలిపారు. 127 ఇండ్లు బెస్మిట్ స్థాయివరకు నిర్మించుకోగా 75 మంది రూ.లక్ష చొప్పున మొదటి విడుతలో లబ్ధి పొందారని తెలిపారు. ముగ్గురు లెంటల్ లెవల్ వరకు నిర్మించుకోగా మరో లక్ష చొప్పున నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం ప్రతీ సోమవారం ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా ఆయా స్టేజిల నిర్మాణాల మేరకు విడుతల వారిగా నిధులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలి

పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, దోమలవ్యాప్తి అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డునంబర్ 17లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అన్నివార్డులలో నిరంతరం పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. వర్షాకాలంలో మురికికాల్వల్లోని నీరు ప్రవహించేలా చూడాలని, మురికికాల్వలు, రోడ్లపై నీరు నిల్వకుండా ఉండే విధంగా పనులు చేయాలని అన్నారు. ఇన్‌చార్జీలు వార్డుల్లోపర్యటించి శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సబ్సిడీ విత్తనాలు పొందాలి

- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న పోచారం

బాన్సువాడ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాలను పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. 30కిలోల జీలుగు విత్తనాల ధర రూ.4275 ఉంటే 50శాతం సబ్సిడీపై కేవలం రూ.2137.50 మాత్రమే అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, సొసైటీ చైర్మెన్ ఎర్వల కృష్ణారెడ్డి, జిల్లావ్యవసాయ శాఖ అధికారి తిరుమలప్రసాద్, నాయకులు జంగం గంగాధర్, దుద్దాల అంజిరెడ్డి, ఏజాస్, నార్ల రవీందర్, నార్ల సురేశ్ ఉన్నారు.



మేనూర్‌లోని విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న బృందం సభ్యులు

విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- జిల్లా విత్తన తనిఖీ బృందం హెచ్చరిక

మద్నూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ అపర్ణ దుకాణ యజమానులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని విత్తన దుకాణాలను బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ విత్తన దుకాణాలలో రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు నాణ్యతమైన విత్తనాలను విత్తన చట్టం పరిధిలో లోబడి విక్రయించాలని సూచించారు. విత్తన డీలర్లు తెచ్చుకున్న విత్తన స్టాక్స్ ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, అలాగే ఏ స్టాక్స్ ఏ కంపెనీ స్టాక్ తెచ్చుకున్నారో వాటి పీసీలు, బిల్స్, ఇన్వైస్ పెట్టుకోవాలని సూచించారు. రైతులకు విక్రయించిన విత్తనాలకు రసీదు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలు కొనొదద్దని, మధ్య దళారుల దగ్గర కాకుండా లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలని కోరారు. విత్తన డీలర్లు ఎవరైనా పత్తి విత్తనాలను, సోయా విత్తనాలను అధిక ధరలకు అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు పవన్ కుమార్, నరేందర్, మండల వ్యవసాయ అధికారి రాజు, మండలంలోని డీలర్లు, విత్తనాల దుకాణదారులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల జాడేది?

- సమయానికి రైతు వేదికలకు రాని ఏఈవోలు
- నిత్యం తాళాలతో వెక్కిరిస్తున్న రైతు వేదికలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నసురుల్లాబాద్‌లో అధికారుల కోసం ఎదురు చూస్తున్న రైతులు



మిర్జాపూర్‌లో రైతు వేదికకు తాళం వేసి ఉన్న దృశ్యం

నసురుల్లాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు అందుబాటులో ఉండకుండా పత్తా లేకుండా పోయారని మండల రైతులు, ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవగాహన, వ్యవసాయంలో మెలకువలు కల్పించడం కోసం ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒక అధికారిణి ప్రభుత్వం నియమించింది. దీనిలో భాగంగా నసురుల్లాబాద్ మండలంను మూడు క్లస్టర్‌లుగా విభజించి ముగ్గురు ఏఈఓ లను నియమించారు. వీరిలో ఏ ఒక్కరు కూడా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు నసురుల్లాబాద్, దుర్కి, మిర్జాపూర్, గ్రామాలలో గల రైతు వేదికలకు ఏఈఓలు రాకపోవడంతో రైతులు రైతు వేదికలకు వేసిన తాళాలను చూసి వెనుతిరుగుతున్నారు.

రైతు సమస్యలు తీర్చేవారేరి?

మండలంలో రైతు సమస్యలు తీర్చడానికి ఏఈవోలు అందుబాటులో ఉండాల్సి ఉండగా, రైతు వేదికలకు ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటోందని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో తమ సమస్యలు తీర్చేవారు ఎవరని రైతులు వాపోతున్నారు. ఓ రైతుకు అకాల మరణం సంభవిస్తే రైతు బీమా ఏ విధంగా రావాలో అడగాలన్నా, రైతుబంధు డబ్బులు తమ ఖాతాలో జమ కాలేదని సమస్యను అధికారికి చెప్పుకోవాలన్నా, పీఎం కిసాన్ డబ్బులు ఖాతాలో జమ కాలేదని చెప్పుకుందామన్నా, ధాన్యం డబ్బుల గురించి మాట్లాడాలన్నా ఎవరూ ఉండడం లేదని, తమ సమస్యను ఎవరి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రైతు వేదికలకు తాళంవేసి ఉండడంతో తమను పట్టించుకునే వారే కరువయ్యారని రైతులు చింతిస్తున్నారు.



మా గోడు వినే వారే లేరు.

- నరసింహులుగౌడ్, రైతు, నసురుల్లాబాద్

మండల కేంద్రంలో గల రైతు వేదికకు ఎప్పుడు వెళ్లినా తాళం వేసే ఉంటుంది. పడిగాపులు కాసి ఎవరూ లేకపోవడంతో వచ్చేస్తున్నాం. సమస్యలు, సందేహాలను చెప్పుకుందామంటే మా గోడు వినేవారు కానరావడం లేదు.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

- భవానీ, ఏవో, నసురుల్లాబాద్



రైతులకు అందుబాటులో ఉంటూ రైతు సమస్యల పరిష్కారానికి ఏఈవోలు మార్గం చూపించాలి. రైతులకు అందుబాటులో ఉండకుండా సమయపాలన పాటించని ఏఈఓల పై ఉన్నతాధికారులకు నివేదించి శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

మల్లుపల్లిలో తీవ్ర విషాదం

● ఒకే ఇంట్లో ఒకేరోజు ఇద్దరి మృతి

● ఒకరు అనారోగ్యంతో.. మరొకరు విద్యుత్ షాక్‌తో మృతి

భిక్కనూరు, మే23 (ఆంధ్రజ్యోతి): ఒకే ఇంట్లో ఇద్దరు వేర్వేరుగా ఒకేరోజు మృతిచెందిన ఘటన భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోకాళ్ల లక్ష్మీ అలీయాస్ ఊర్మిళ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో కుటుంబసభ్యులు ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తుండగా వ్యవసాయ బావివద్ద పశువులకు నీరు పెట్టేందుకు మృతురాలి మరిది (భర్త సోదరుడు) మోకాళ్ల బాల్‌రెడ్డి (65) సాయంత్రం సమయంలో వెళ్లగా అక్కడ స్టార్టర్ వైరు తగడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు గ్రామపెద్దలతో కలిసి పోలీసులకు సమాచారం అందించగా వెంటనే ఎస్సై అంజనేయులు సంఘటన స్థలానికి చేరకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఒకేరోజు ఒకే ఇంట్లో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆలూర్‌లో డీఈవోకు సన్మానం



ఆలూర్‌లో డీఈఓని సన్మానిస్తున్న ఎంఈవో

ఆలూర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎం ట్రైనింగ్ కార్యక్రమాన్ని డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. అదేవిధంగా ఆలూర్ మండలానికి తొలిసారిగా విచ్చేసిన డీఈవో అశోక్‌ను సన్మానించిన కోర్స్ డైరెక్టర్, ఎంఈవో నరేందర్ సన్మానించారు. ఇందులో మండల రిసోర్స్‌పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో పంటనష్టం



మొలకెత్తిన వరిధాన్యం

ఆలూర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షానికి పంట నష్టం జరిగింది. ఈ విషయంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది. నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు పడడం తో సజ్జ, వరి పంటకు సంబంధించి భారీ నష్టానికి గురైనట్లు రైతులు తెలిపారు. కొన్నిచోట్ల ఏకంగా ధాన్యం మొలకలు వచ్చా యని, ఇలాంటి ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, తరుగు తీసుకోవద్దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెండోర, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందడంతో వారి అంత్యక్రియలకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తంబల్ల భూదేవి, లక్కంపల్లి రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో వారి అంత్యక్రియలకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ నాయకులు గుండోజీ రవి, బద్దం అశోక్, మౌలానా గంగాధర్, ప్రవీణ్, సాయి, కిరణ్, తదితరులు అందజేశారు.

బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్



డిప్యూటీ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మోర్తాడ్, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు సంవత్సరాలుగా సేవలందించిన డిప్యూటీ తహసీల్దార్ సుజాత ఆర్మూర్ తహసీల్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న డిప్యూటీ సుజాతను తహసీల్దార్ కృష్ణ రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నాలుగు సంవత్సరాల విధి నిర్వహణలో తనకు సహకరించిన ఉద్యోగులు మండల ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి సన్మానం



సంజీవయ్యను సన్మానిస్తున్న రైల్వే ఉద్యోగులు

వేల్పూర్, మే 23(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన దివ్యాంగుల అంతర్జాతీయ బ్యాట్మింటన్ క్రీడాకారుడు సంజీవయ్యను శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే నిలయంలో ఘనంగా సన్మానించారు. రైల్వే నిలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా 39 సంవత్సరాల సుదీర్ఘ కాలంపాటు విధులు సమర్థవంతంగా నిర్వర్తించడంతో మరోవైపు అంతర్జాతీయ దివ్యాంగుల బ్యాట్మింటన్ క్రీడాకారుడిగా రాణించడం పట్ల రైల్వే నిలయం ఉద్యోగులు సంజీవయ్యను అభినందిస్తు శాలువ, మెమెంటుతో సన్మానించారు. సంజీవయ్య ఇటు ఉద్యోగంలోను సమర్థవంతంగా విధులు నిర్వహస్తు అంతర్జాతీయ క్రీడల్లో రాణించడం అభినందనీయమని జాన్కంపేట్ గ్రామ ప్రజాప్రతినిధులు, విడిసి సభ్యులు, దళిత ఐక్యసంఘటన ఆర్మూర్ డివిజన్ పూర్వ ప్రధాన కార్యదర్శి జంగం అశోక్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం అయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్



తాళ్ళరాంపూర్‌లో భూమి పూజ చేస్తున్న దృశ్యం

● సబ్ కలెక్టర్ వికాస్ మహతో

● ఎంపీడీవో ఆఫీస్‌ను సందర్శించిన అధికారి

బోధన్‌రూరల్,మే23(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం అయ్యేలా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బోధన్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయి,, ఎన్ని ప్రారంభించబడ్డాయి తదితర విషయాలపై ఎంపీడీవో బాలగంగాధర్‌తో చర్చించారు. రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను పెండింగ్ ఉంచవద్దని బ్యాంకుల ప్రాసెసింగ్ చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వాటిలో మొక్కలు నాటే ప్రణాళికలను రూపొందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంపీవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

నందిపేట : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులు భూమిపూజ చేశారు. గ్రామానికి ప్రభుత్వం 30 ఇళ్లను మంజూరు కాగా వీరిలో ఐదుగురు లబ్దిదారులు మాత్రమే భూమిపూజ చేశారు. లబ్దిదారులు మంచి రోజులను బట్టి భూమి పూజ చేసుకుంటున్నారు. మిగత ఇళ్లకు త్వరలోనే భూమిపూజ చేయిస్తామని అధికా రులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మీసాల సుదర్శన్, మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు పోగుల గంగాధర్, ఎండియాల గంగాధర్, రాజు, కార్యదర్శి సాయికుమార్ ఉన్నారు.

ఏర్గట్ల : మండల కేంద్రతో పాటు తాళ్ళరాంపూర్ గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు మార్కింగ్ వేశారు. మండల కేంద్రంలో 49, తాళ్ళరాం పూర్‌లో 58 లబ్ధిదారులు ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మంమండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవారెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్‌లు మాట్లాడుతూ నిరుపేద లకు ఇండ్లు కట్టించడమే కాంగ్రెస్ లక్ష్యమని, ఇండ్లు మంజూరులైన లబ్ధిదారులు నిర్మాణాలు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పన్నాల నర్సారెడ్డి, బెజ్జారపు భాను, ఎంపిడీవో వెంకటేశ్వర్లు, ఎంపీ వో శివచరణ్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, బోజన్నలున్నారు.

వర్ని : మండల కేంద్రంలోని సత్యనారాయణపురంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బోధన్ డీఎల్‌పీవో నాగరాజు భూమిపూజ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గువేసి పునాదులు తీయించారు. ఇళ్ల నిర్మాణంను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌పీవో సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మారుతి, కార్యదర్శి సాయిలు, ఆపరేటర్ రవి పాల్గొన్నారు.

మోస్రా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మోస్రా మండల కేంద్రంలో శుక్రవారం ముగ్గు పోసి ఇళ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల నాయకులు, గ్రామస్థులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

కోటగిరి : పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో చందర్ భూమిపూజ చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. పలు ఇళ్లకు ముగ్గువేసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఆదర్శ్, పంచాయతీ కార్యదర్శి జగదీష్ తదితరులున్నారు.



అయిలాపూర్‌లో భూమిపూజ చేస్తున్న లబ్దిదారులు



వర్నిలో ముగ్గు పోస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

రైతులు దుక్కులు చేసుకోవాలి

● రుద్రూరు ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాకేష్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాకేష్

నవీపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు రైతులు లోతు దుక్కులు చేసుకోవాలని రుద్రూరు ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాకేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన రైతు ముంగిల్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలలో లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా తెగుళ్లు, పురుగుల నివారణతో పాటు నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. నేల కోత నివారించుకుని, నేల నీటి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని ఆయన సూచించారు. దుకాణాలలో ఎరువులు కొనే ముందు రైతులు రసీదు తప్పకుండా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విత్తన శుద్ది ప్రాముఖ్యత, లాభాలు, వివిధ పంటల్లో విత్తన శుద్ది చేసుకునే విధానాలు, విత్తన శుద్దికి పంటల వారిగా వాడాల్సిన మందులు, వాటి మోతాదుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త పద్మావతి, ఏవో నవీన్ కుమార్, నవీపేట వెటర్నరీ వైద్యులు నరేందర్, ఏఈవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అధికారులు, రైతులు ఆవిష్కరించారు.

ముప్కాల్ తహసీల్దార్‌గా ఎంకే ముంతాజుద్దీన్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంకే ముంతాజుద్దీన్

ముప్కాల్, మే 23(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ నూతన తహసీల్దార్‌గా ఎంకే ముంతాజుద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ గజానన్ బదిలీపై నిర్మల్ వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ ఎంకే ముంతాజుద్దీన్ మాట్లాడుతూ భూభారతి ఇతర సర్టిఫికేట్లు, వివిధ అవసరాల కోసం వచ్చేవారు నేరుగా తనను కలవచ్చని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేస్తానన్నారు. కాగా కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కమ్మర్‌పల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.ప్రసాద్



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జి.ప్రసాద్

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి తహసీల్దార్ గా జి ప్రసాద్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దార్‌గా విదులు నిర్వర్తించిన ఎం అంజనేయులు పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వెల్లారు. కాగా జిగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం నుండి కమ్మర్ పల్లిత మండల తహసీల్దార్‌గా జి. ప్రసాద్ బదిలిపై వచ్చి బాద్యతలు స్వీకరించారు. ఆయకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలుకుతు బదిలిపై వెలుతున్న ఎం అంజనేయులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆర్ ఐ శరత్, అరవింద్, ఈనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లు సుంకెట జ్యోతి, శివజ్యోతి, బాలచెందర్, శేక్ చిన్న సాహెబ్, బలరాం, దీపక్, కిష్టయ్య మారంపల్లి అశోక్, తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ అందుబాటులో జీలుగ విత్తనాలు

● సొసైటీ చైర్మన్‌సామ బాపురెడ్డి



జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

కమ్మర్‌పల్లి, మే 22: (ఆంధ్రజ్యోతి) రైతులు తమ పంట పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకునేందుకు ప్రభుత్వం సబ్సీడిపై అందజేస్తున్న జీలుగవిత్తనాలు సొసైటి పరిది రైతులందరికి సరిపడ అందుబాటులో ఉన్నాయని సొసైటి చైర్మన్ సామ బాపురెడ్డి అన్నారు. శుక్రవారం కోనాసముందర్ సొసైటిలో జీలుగ విత్తనాల పంపిని కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సబ్సీడిపై ప్రభుత్వం అందజేస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డవిత్తాలకోసం రైతులు తమ పట్టేదార్ పాసుపుస్తకంతో పాటు రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు తీసుకొని రివలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సోసైటి వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, మార్కెట్ కమిటి మాజీ చర్మన్ మలావత్ ప్రకాశ్ నాయక్, డైరెక్టర్‌లు ఇటుకల శ్రీనివాస్, బద్దం నవీన్, విడిసి అద్యక్షులు కంతి సాయన్న, కమిటి సభ్యులు సోసైటి పరిది గ్రామాల రైతులు, సీఇవో కార్తిక్, క్లర్క్ అంజయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని కోనాసమందర్‌తో పాటు చౌట్‌పల్లి, కోనాపూర్ గ్రామాల సోసైటిల్లోను జీలుగ విత్తనాలు పంపిణిచేసినట్లు మండల వ్యవసాధికారి రమ్యశ్రీ తెలిపారు.పంపిణి కార్యక్రమంలో ఆయ సోసైటీల చైర్మన్‌లు కుంట ప్రతాప్ రెడ్డి, బడాల రమేష్ రెడ్డి వైస్ చైర్మన్‌లు గడ్డం శ్రీధర్, లక్ష్మీనరాయణ, ఆయా గ్రామాల రైతులు పాలత్గొన్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మోస్రా,మే23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని కిరాణ దుకాణాలు, హోటల్లో యాజమానులను కలిసి ప్లాస్టిక్ నిర్మూలన కోసం పాటు పడాలని సూచించారు. ఈ ప్లాస్టిక్ పట్ల మూగజీవాలకు, మనిషి మనుగడకు ప్రమాదమని, ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి కోటేష్ జాదవ్, బీట్ అధికారి హుస్సేన్, దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

దుకాణాలకు వేలం



వేలంపాటలో పాల్గొన్న దృశ్యం

బోధన్‌రూరల్,మే23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలోని రెండు దుకాణాలను లీజ్ లైసెన్స్ వేలంపాట నిర్వహించగా నలుగురు సభ్యులు పాల్గొన్నారని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. దుకాణం నెంబర్ 5కు ఇద్దరు వేలంపాటలో పాల్గొనగా కాళీదాసు చారి 7100రూపాయలకు పలికి దక్కించుకున్నారన్నారు. మరో వేలంపాటలో 7200రూపాయలకు బొప్పాపురం హన్మాండ్లు చారి తీసుకున్నారన్నారు. దీని వల్ల ఆలయానికి ఆదాయం సమకూరుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి మందిర్ చైర్మన్ గుండెటి శంకర్, ఈవో రాములు, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, ఆలయ అర్చకులు ప్రవీణ్ శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్ల పంపిణీ దృశ్యం

బోధన్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా తేజ క్రియేటివ్ కిడ్స్ డ్రాయింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ విద్యార్థులకు శుక్రవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలు ఖైరాన్, ఎంబెల్లి శంకర్, గంగాధర్ విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్రకళలో గురువుల ద్వారా మెలకువలు నేర్చుకుని భవిష్యత్‌లో గొప్ప చిత్రకళాకారులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తేజ అకాడమీ డైరెక్టర్ లక్ష్మణ్ తేజ, చిత్రకళ బోధకులు ఎర్రోళ్ల అవంతి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్‌స్కూల్‌లో అర్హత సాధించడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్,మే23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో విజ్ఞాన కోచింగ్ సెంటర్ విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశాలలో అర్హత పరీక్షలు రాసి ర్యాంకులు సాధించడం అభినందనీయమని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ఏప్రిల్ 5వ తేదిన ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశాల కొరకు అర్హత పరీక్షలు నిర్వహించారన్నారు. బోధన్ పట్టణంలోని విజ్ఞాన కోచింగ్ స్కూల్ విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించి వికసించారని పేర్కొన్నారు. సైనిక్ పాఠశాలలో ప్రవేశ అర్హత పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అభినందించారు. కోచింగ్ సెంటర్ నుండి 23మంది విద్యార్థులు అర్హత పరీక్ష రాయగా 17మంది విద్యార్థులు ప్రవేశాల కొరకు అర్హత సాధించారని అన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోధన్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన బడుడి సాయికుమార్(30) అనే వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ కలహాలతో ఇంట్లోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు బోధన్ రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దు

బోధన్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణం, రూరల్‌లో ఉన్నట్టువంటి విద్యార్థి, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలలో మాత్రమే విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించాలన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలల యొక్క లిస్టు బోధన్ మండల విద్యావనరుల కేంద్రంలో నోటీసు బోర్డుపై ప్రదర్శించడం జరిగిందన్నారు.

నేటి నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం

వేల్పూర్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం ఉంటుందని ఏవో శృతి తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు పడిగెల ప్రజాభవన్‌లో, ఈనెల 27న అంక్సాపూర్‌లో రైతువేదికలో, జూన్ 3వ తేదీన మోతే గ్రామ రైతువేదికలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల పరిధిలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఏవో శృతికోరారు.

రైతులను కలవరపెడుతున్న సజ్జ పంట

● వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన సజ్జ ● సిరులు కురిపించే సజ్జ వర్షాలతో నష్టాలు



పంటకు నిలువుగా మొలకలు వచ్చిన దృశ్యం



సజ్జకు మొలకలు వచ్చిన దృశ్యం

ఆర్మూర్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): సిరులు కురిపించే సజ్జపంట అకాల వర్షాలతో రైతులను కలవర పెడుతుంది. ఇటీవల వరుసగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సజ్జపంట దెబ్బతిని నష్టాలనే మిగులుస్తుంది. ఆర్మూర్ డివిజన్‌లో సుమారు 50వేల ఎకరాల్లో సజ్జపంట సాగు చేస్తున్నారు. ఇటీవల వరుసగా అకాల వర్షాలు కురి యడంతో సజ్జపంట తీవ్రంగా దెబ్బతింది. డివిజన్‌లో 50వేల ఎకరాల్లో సజ్జపంట సాగుచేయగా అధికభాగం పంటను కోసి వేశారు. మిగతా సుమారు 15వేల ఎకరాలలో పంట కోయకుండా అలాగే ఉంది. పంట కోత దశకు వచ్చి త్వరలోనే కోస్తామన్న దశలో అకాల వర్షాలు కురియడంతో పంట నిలువుగా ఉన్న సమయంలోనే వర్షంకారణంగా వ్యవసాయ క్షేత్రాలలో నిలువ ఉన్న సజ్జ కంకులకు మొలకలు రావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటి సమయంలో సజ్జపంటను కొనడానికి వ్యాపారులు ఎవరు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

సజ్జ పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతులు సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటల సాగులో పెట్టుబడులు ఇతర ఖర్చులు ఈ సీజన్‌కే సరిపోతుంటాయి. అసలైన ఆదాయం రైతులకు ఎర్రజొన్న, సజ్జ పంట నుంచే వస్తుంటాయి. అందుకే ఎర్రజొన్న, సజ్జ పంటలను సిరులు కురిపించే పంటలుగా అభివర్ణిస్తుంటారు. సజ్జ క్వింటాలుకు రూ.6500 వెచ్చించి కొనుగోలు చేస్తుంటారు. రైతుకు సుమారు ఎకరాన 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సగటున 13 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతుకు 80వేల రూపాయల ఆదాయం సమకూరుతుంది. సజ్జపంటను మెండోర, డొంకేశ్వర్, ఆర్మూర్, ఆలూర్, నందిపేట మండలాలలో సాగుచేస్తుంటారు. సుమారు 45 నుంచి 50వేల ఎకరాల్లో సాగుచేస్తుండగా సుమారు 15వేల ఎకరాల్లో సజ్జపంట వర్షాలకు దెబ్బతిని మొలకలు రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సజ్జపంటను సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా మారిన ఆర్యనగర్ కాలనీ రోడ్లు

మోపాల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు అస్తవ్యస్తం గా మారాయి. నగరంలోని ఆర్యనగర్ కాలనీలో గల ప్రధాన రోడ్లతో పాటు చిన్నపాటి రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతలలో నీరు చేరడంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లన్నీ జలమయంగా మారాయి. రోడ్లపై తిరిగే వాహనదారులకు, పాదచారులకు ఎక్కడ గుంత ఉందో ఎక్కడ రోడ్డు బాగుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. రోడ్లపై ప్రయాణించాలంటే కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చెరువులను తలపించే విధంగా మారడంతో ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని స్థానిక వాసులు వాపోతున్నారు. రానున్న వర్షా కాలంలో పెద్ద వర్షాలకు రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా మారుతాయని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతియేడాది ఎప్పటికప్పుడు రాజకీయ నాయకులు వచ్చి రోడ్లు బాగు చేస్తామని ఇస్తున్న హామీలు హామీలుగానే మిగిలిపోతున్నాయి. ఈ రోడ్డు గుండానే పోవాలం టేనే రోడ్లు గుంతలుగా ఉండటంతో ప్రజలు జంకుతున్నారు. ప్రతీ సంవత్సరం వర్షా కాలంలో ఈ ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ కాలనీ గతంలో బోర్గాం (పి) గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు తమకు ఎలాం టి ఇబ్బందులు ఉండేవి కాదని ఇప్పుడు నగర పాలక సంస్థలో కలపడంతో బడ్జెట్ పేరుతో రోడ్లను మాత్రం బాగు పర్చడం లేదన్నారు. ఎప్పటికప్పుడు రోడ్లను బాగు చేస్తామని చెప్పిన ప్పటికీ రోడ్ల దశ మాత్రం అంతంతగానే ఉంది. కాలనీ వాసులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ రోడ్డు గుండానే ఉన్నతాధికారులు వస్తూ పోతుంటారు తప్ప పట్టించుకునే వారు కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. వర్షాలు ఇంకా ముదరక ముందే అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.





రోడ్డుపై నీరు చేరిన దృశ్యం

రోడ్డును బాగు చేయండి: రాజేశ్వర్, కాలనీవాసి



చిన్నపాటి వర్షం కురిస్తేనే ఈ రోడ్డంతా జలమయంగా మారుతుంది. ఈ రోడ్డు గుండా ప్రజలు పోవడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ సంవత్సరం కాలనీ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేక పోతున్నారు. నీరంతా రోడ్లపైనే ప్రవహించడంతో ప్రజలు ఎక్కడ విషజ్వరాలకు గురవుతారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులను చేపట్టాలి.



స్వగ్రామాలకు గొర్రెలు తరలి వెలుతున్న దృశ్యం

వలస జీవుల తిరుగు పయనం

పెద్దకొడప్‌గల్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవికాలంలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయి. గతంలో రోహిణి కార్తె ప్రారంభం అయ్యే సమయంలో ఎండల తీవ్రత అధికంగా ఉండేది. రోహిణి కార్తెలో రోకండ్లు పగిలేంత ఎండ కాస్తుందని నానుడి ఉండేది. అయితే ఈ సంవత్సరం రోహిణి కార్తెకంటే ముందుగానే భారీ వర్షాలు కురుస్తు న్నాయి. జుక్కల్ నియోజక వర్గంతో పాటు, బాన్సువాడ నియోజక వర్గంలో మంజీరా నది పరివాహక ప్రాం తంలో నీటి లభ్యత అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలో రైతన్నలు పంటలను అధికంగా సాగు చేస్తారు. పంటలు కోసిన తర్వాత ఈ ప్రాంతాలకు కర్నాటకతో పాటు మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాలకు చెందిన గొర్రెల కాపరులు తమ జీవాలను తీసుకుని వచ్చి పంట పొలాలు కోసిన ప్రాంతాలలో జీవనం గడుపుతారు. వేల సంఖ్యలో గొర్రెల మందలు ఈ ప్రాంతానికి వలస వచ్చి వర్షాకాలం ప్రారంభం కాగానే తిరిగి తమ స్వగ్రామాలకు వెలుతుంటారు. ప్రతీ సంవత్సరం జూన్ చివరి వారం లేదా జూలై నెలలో స్వగ్రామాలకు వెల్లే గొర్రెల కాపలదారులు ఈసారి మాత్రం తొందరగా తమ స్వస్థలాలకు బయలు దేరారు. వారం రోజుల నుంచి వర్షాలు కురియడంతో జీవాలను తీసుకుని స్వస్థలాలకు తరలుతున్నారు.

ఒకే చెట్టులో వింతలెన్నో..!

పెద్దకొడప్‌గల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో వింతలు ఒక్కోసారి ఒక రకంగా దర్శనమిస్తుంటాయి. ఆకాశంలో జరిగే వింతలతో పాటు భూమిపైన, నీటిపైన వివిధ రకాల రూపాలలో ప్రకృతి తన మాయను ప్రదర్శిస్తుంటుంది. పచ్చని పొలంలో మోడు వారిన చెట్లు ఓ సారి కనబడితే, నిండా జలం ఉన్నా ప్రాంతంలో చెట్లు ఎండిపోయి దర్శనమిస్తుంటాయి. ఇదేవిధంగా మండలంలోని ఓ గ్రామ పంట పొలంలో చెట్టుకు ఓ వైపు చిగురించి ఆకులతో దర్శనమిస్తుంటే, అదే చెట్టుకు మరో వైపు కొమ్మ ఎండిపోయి కనబడుతుంది. దీంతో ఈ వృక్షాన్ని తిలకించిన వారు ప్రకృతి ఇదంతా ప్రకృతి మాయని చర్చించుకుంటున్నారు.



ఓ పక్క ఆకులు.. మరో పక్క మోడు వారిన చెట్టు

రెండు దశాబ్దాల కాలంలో ఒకేసారి స్నాతకోత్సవం

● రెండోసారి నిర్వహణకు ఆటంకాలు అధికం ● పట్టించుకోని టీయూ ఉన్నతాధికారులు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



టీయూ పరిపాలన భవనం



స్వాగత తోరణం



టీయూ న్యాయ కళాశాల

డిచ్‌పల్లి మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడుస్తున్న వర్సిటీ ప్రారంభ సమయంలో ఒకేసారి స్నాతకోత్సవం నిర్వహించారు. నాటి నుంచి మళ్లీ స్నాతకోత్సవం నిర్వహించాలని ఏళ్లుగా డిమాండ్ వస్తున్న వర్సిటీ ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణ యూనివర్సిటీ లో స్నాతకోత్సవం యూజీసీ నిబంధనల మేరకు ప్రతీ ఏడాది నిర్వహించాల్సి ఉన్న అందుకు విరుద్దంగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పడినప్పుడు మొదటి వీసీగా పనిచేసిన అక్బర్అలీఖాన్ స్నాతకోత్సవం నిర్వహించిప్రతిభ గల విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. నాటి నుంచి నేటి వరకు మళ్లీ స్నాతకోత్సవం నిర్వహణపై తర్వాత వచ్చిన వైస్ చాన్స్‌లర్‌లు పట్టించుకోలేదు. యూజీసీ నిబంధనల మేరకు ఏడాది కోసారి నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారి పత కాలు, స ర్టిఫికేట్‌లు అందించాల్సి ఉన్న వర్సిటీ అధికారులు మాత్రము ప ట్టిం చుకోవడం లేదు. తెలంగాణ యూనివర్సిటీ తో పాటు ఏర్పాటు అయిన న ల్గొండ మహాత్మగాంధీ యూనివర్సిటీలో ఇప్పటి వరకు నాలుగు సార్లు స్నా తకోత్సవాలు జరిగాయి. కానీ టీయూలో మాత్రము నిర్వహణపై స్పష్టత కొరవడింది. ప్రతీసారి నూతనంగా వీసీలు వచ్చిన సమయంలో స్నాతకోత్సవంపై అధికారులతో సమీక్షాలు సమావేశాలు జరపడం అది కాస్తా పెండింగ్‌లో పడటం పరిపాటిగా మారింది. 2018, 2020లో స్నాతకోత్సవం పై పలు దఫాలుగా చర్చలు జరిపి ముందుకు వెళ్లిన అది కార్యరూపం దాల్చ లేదు. ప్రతీ యేడాది నిర్వహించాల్సిన స్నాతకోత్సవం రెండు దశాబ్దాలు అయిన చేయక పోవడంపై విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైన వీసీ యాదగిరిరావు తగు చర్యలు తీసుకొని స్నాతకోత్సవం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన

గన్యతండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు



అర్ధాంతరంగా నిలిచిపోయిన గన్యతండా గ్రామ పంచాయతీ భవనం పనులు



పాత అంగన్‌వాడి భవనంలో కొనసాగుతున్న గన్యతాండ గ్రామ పంచాయతీ కార్యాలయం

● పట్టించుకోని అధికారులు

జక్రాన్‌పల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్యతాండా గ్రామంలో అర్ధాంతరంగా నూతనంగా గ్రామ పంచాయతీ భవనం పనులు నిలిచిపోయాయి. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో పంచాయతీ భవనం పనులు చేపడుతున్నారు. గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఐదు వందల జనాభా కలిగిన ఉన్న మండలంలోని వివేక్‌నగర్ తండా, చందామియా తండా, బాలనగర్, మాదాపూర్, నల్లగుట్ట తండాలను నూతన గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేసింది. ఇందులో గత రేండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వంలో గన్యతాండాలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులను చేపట్టారు. గత రేండేళ్ల నుంచి గ్రామ పంచాయతీ భవనం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ భవనం పనులు కొనసాగడం లేదు. బేస్‌మిట్, పిల్లర్లు మధ్యనే ఈ భవనం పనులు నిలిచిపోగా ఈ భవనం పనులను చేప ట్టాలని గన్య తండా గ్రామస్థులు సంబందిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోవడం లేదని తన్యతాండా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామ పంచాయతీ భవనం పనులు ఎందుకు నిలిచిపోయాయో అధికారులు సమాధానం చెప్పాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పాత అంగన్‌వాడి భవనంలో ప్రస్తుతం గ్రామపంచాయితీ కార్యా లయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడానికి గ్రామంలో ప్రధాన సమస్య ఉందని ఆ సమస్యను అధికారులు పరిష్కరిస్తే ఈ భవనం పనులు చేపటేందుకు సానుకూలంగా ఉంటుందని తాండా గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబందిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన గన్యతండా నూతన గ్రామ పంచాయతీ భవనం పనులను చేపట్టాలని కోరుతున్నారు.

● నిలిచిపోయిన పనులు త్వరలో చేపడుతాం..

డి. సురేందర్ వర్మ, పీఆర్ఏఈ, జక్రాన్‌పల్లి

మండలంలోని గన్యతాండా గ్రామంలో నిలిచిపోయిన నూతన గ్రామ పంచాయితీ భవనం పనులను త్వరలో చేపడుతాం. ఈ పంచాయితీ భవనం పనులు చేపట్టేందుకు గన్యతాండా గ్రామస్థులు సహకరించాలి. ఈ భవనం పనులను చేపట్టి త్వరలో పనులను పూర్తిచేస్తాం.

నాడు నాటారు.. నేడు నరికారు!

● విద్యుత్ తీగలకు తగులుతున్నాయని నరికివేత




డిచ్‌పల్లి, విద్యుత్ తీగాలకు అడ్డు వస్తున్నందున నరికిన చెట్లు

డిచ్‌పల్లి మే 23 (ఆంధ్రజ్యోతి): హరితహారం పేరిట ప్రతి ఏడాది లక్షాలాది మొక్కలు నాటుతున్నారు. అవెన్యూ ప్లాంటెషన్ పేరుతో ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఆధ్వర్యంలో భారీగా మొక్కలు గతంలో నాటారు. మొక్కలు ప్రస్తుతం చెట్లుగా రూపాంతరం చెందాయి. కానీ అవి విద్యుత్ తీగలకు తగులుతున్నాయని డిచ్‌పల్లి-నడిపల్లి- ధర్మారం-మాధవనగర్ రైల్వే గేటు వరకు రోడ్డుకు ఇరువైపుల భారీగా చెట్ల ను విద్యుత్ శాఖ అధికారులు కొట్టి వేయిస్తున్నారు. దీనిపై అటవీ శాఖ సిబ్బంది సంబంధిత గ్రామ పంచాయతీలలో పిర్యాదు చేసిన విద్యుత్ శాఖ అధికారులు మాత్రము పట్టించుకోవడం లేదు. ఆయా అధికారుల సమన్వయ లోపంతో భారీగా పెరిగిన చెట్లను నరికివేస్తున్న పట్టించుకునే నాథుడు లేదు. వెంటనే చెట్లను నరకడం నిలిపివేయాలని, రానున్న వర్షకాలం సందర్భంగా మరిన్ని మొక్కలను పెంచాలని ప్రకృతి ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.

రైతు సదస్సులు ఏర్పాటు చేసేదెన్నడో..!?

● మరిచిన మన తెలంగాణ మన వ్యవసాయం ● ఈ సారి మండలానికో సదస్సు ● అవగాహన లేక నష్టపోతున్న రైతులు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

ఏర్గట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్షకులకు పంటల సాగులో అవలంబిచాల్సిన విధానాలు, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు, సాగుకు ముందు చేయించాల్సిన భూ పరీక్షలు ఇలా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సలహాలు, సూచనలు ఇవ్వడానికి రైతులకు సదస్సులు ఏర్పాటుచేయకపోవడంతో వారికి చైతన్యం లేకుండా పోతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన తెలంగాణ మన వ్యవసాయం పేరుతో రైతు సమన్వయ సమితి సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఏటా వానాకాలం సాగుకు ముందు ఏప్రిల్, మే నెలల్లో అవగాహన సదస్సులను నిర్వహించేది. కానీ రెండేళ్లుగా రైతులకు మన తెలంగాణ మన వ్యవ సాయంపై ఊసే ఎత్తడం లేదు. దీంతో ఆధునిక విధా నాలపై అవగాహన లేక, ఏళ్లుగా ఒకే పంట సాగుచేస్తూ, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతూ రైతులు నష్టపోవడం అనవాయితీగా మారింది.

అవగాహన లేకపోవడంతో నష్టాలు

గ్రామాల వారిగా రైతుల వద్దకు వెళ్లి సాగులో మెళకువలపై అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అంతే కాక నష్టాలు తగ్గే అవకాశముంది. గతంలో సదస్సులు నిర్వహించేటప్పుడు వ్యవసాయ అధికారుల బృందం ఉదయం 7గంటల కల్లా గ్రామా లకు వెళ్లి వివిధ అంశాలపై అవగాహన కల్పించడ మే కాక రైతుల నుంచి సంతకాలు సేకరించేవారు. కానీ రెండేళ్లుగా రైతు సమన్వయ సమితీల జాడ లేక పోగా, అవగాహన సదస్సుల విషయాన్నే మరిచిపో యారు. ఈ ఏడాది రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు పేరిట సదస్సులు నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఏదేమైన రైతులకు పంట సాగులో పాటించాల్సిన పద్ధతులు, సలహాలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవగాహన కల్పించాలి..

పొత్కూరి మహేష్, రైతు, ఏర్గట్ల



సాగుకు ముందు పంటలు, విత్తనాల రకాలపై అధికారులు అవగాహన కల్పించాలి. ప్రస్తుత ప్రభుత్వం చైతన్య సదస్సులు నిర్వహించి సేం ద్రి య వ్యవసాయం, భూసార పరిక్షలు, ఇతర అంశాలపై వివరించాలి.

జూన్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు సదస్సులు

మండల వ్యవసాయాధికారి, వైష్ణవ్, ఏర్గట్ల



వచ్చే నెల జూన్‌లో మొదటి వారంలో రైతులకు రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలు సదస్సులు నిర్వహించనున్నాము. ప్రతీ మంగళవారం రైతు సదస్సులు నిర్వహించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నాము.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

సదాశివనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని పోలీసు కళా బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించింది. శుక్రవారం సదాశివనగర్‌లోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం అధికంగా జరుగుతుండటం, రైతు కుటుంబాలలో చదువుకుంటున్న విద్యార్థులు తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగించకపోవడం అందుకు ఎందుకు ప్రధాన కారణలవుతున్నాయని అన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఎలాంటి శిక్షలు పడతాయో, భవిష్యత్తు ఏమవుతుందో ప్రతీ ఒక్కరికి వివరంగా తెలియజేయాలని, అప్పుడే చాలావరకు నివారణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో యోసఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను కొలతల ప్రకారం నిర్మించాలి: ఎంపీడీవో

పెద్దకొడప్‌గల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారులు కొలతల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటి నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేద ప్రజలకు గూడు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులు అధికారులు సూచించిన విధంగా కొలతల ప్రకారం ఇంటి నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఇక ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు విడతల వారీగా డబ్బులను వారి ఖాతాలలో జమచేయడం జరుగుతుందని తెలిపారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిరులకు ఇంటి మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్, పండరి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసాయిపేటలో 64.8 మి.మీల వర్షపాతం

కామారెడ్డిటౌన్,మే 23(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో గడిచిన 24 గంటల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. పాల్వంచ మండలం ఇసాయిపేటలో 64.8 మి.మీలు, సదాశివనగర్‌లో 61.0 మి.మీలు, తాడ్వాయి 59.3 మి.మీలు, కామారెడ్డి మండలం పాతరాజంపేటలో 59.3, కామారెడ్డిలో 55.5మి.మీలు,ఎల్పుగొండలో 53.8మి.మీలు,రాజంపేట మండలం ఆర్గొండలో 46.8,రామారెడ్డిలో 41.0,మద్నూర్ మండలం సోమూర్‌లో 38.3, బాన్సువాడ మండలం కొల్లూర్‌లో 36.0, నస్రూళ్లబాద్ మండలం బొమ్మన్‌దేవునిపల్లిలో 33.5, మాచారెడ్డి మండలం లచ్చపేటలో 30.3 మి.మీల వర్షపాతం నమోదైంది.

జీజీహెచ్ ఏడీగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి టౌన్, మే23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జీజీహెచ్ ఏడీగా రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం నుంచి పదోన్నతి పొంది కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతీ రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ఆసుపత్రిలోని అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి సూపరింటెండెంట్ బన్సీలాల్, ఏవో రఘురాం, ఆర్‌ఎంలు సంతోష్, యాదగిరి, ఆఫీస్ సూపరిటెండేంట్‌లు మారుతి, ప్రవీణ్ ఉన్నారు.

వైభవంగా పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం

భిక్కనూరు, మే23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధానవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో వేద బ్రహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

రాజంపేట, మే 23(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలో శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రప్రణీత్‌రెడ్డి తెలిపారు. పేదలకు ఇళ్లు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని మళ్లీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి హయా ంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. 10 సంవత్సరాల నుంచి ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లబ్ధి చేకురుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఏనుగు విజయ్‌రెడ్డి, మండల మహిళాఅధ్యక్షురాలు లక్ష్మీ, మండల సెక్రటరీ చౌదరిరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

గాంధారి, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో శ్రీహరి అన్నారు. ప్రాథమిక విద్యలో సామర్థ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులకు ఐదురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. శుక్రవారం గాంధారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వ్యక్తిగత విభేదాలను గుర్తించి వారికి అనుగుణంగా పాఠశాలలో బోధించేందుకు కావాల్సిన సామర్థ్యాలను అందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల పట్ల, ప్రభుత్వ బడుల పట్ల నమ్మకం కలిగి తమ పిల్లలను పాఠశాలలో చేర్పించుటకు అవగాహన కలుగుతుందని ఎంఈవో పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం

కామారెడ్డి టౌన్, మే23 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ఆధ్వర్యంలో కామారెడ్డిజిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వక్ఫ్ సవరణ బిల్లుపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ జాయింట్ పార్లమెంటరీ కమిటి ఆమోదించిన సవరణలు వక్ఫ్‌బిల్లును మరింత క్లిష్టంగా మార్చాయన్నారు. జేపీసీ మోసపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలనుగాని, వివిధ రాష్ట్రా మైనార్టీ కమీషన్లు, బీజేపీయేతర పాలిత రాష్ట్రాల అభ్యంతరాలను జేపీసీ పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, లాయర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న రఘునాథ్



కుప్రియాల్‌లో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రైతులకు ఇబ్బందులు కలగకుండా

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

సదాశివనగర్, మే23 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్ గ్రామాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులను, తుకాలను పరిశీలించి, అకాల వర్షాల కారణంగా వడ్లు ఏ రకం ఉన్నాయి, మ్యాచర్ ఎలా వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాసాగర్, ఏపీఎం రాజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలన

మహమ్మద్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ సొసైటీ ప్రత్యేకాధికారి ప్రశాంత్‌రెడ్డి నర్వ, తుంకిపల్లి, గాలిపూర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలును వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో వరి ధాన్యంను తూకం చేసిన వెంటనే లారీల్లో రైస్‌మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోళ్లను వేగవంతం చేసి మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మానిటరింగ్ అధికారి కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ సవాయిసింగ్, సొసైటీ సీఈవో చింతలరాములు, సిబ్బంది భాస్కర్, కొనుగోలు కేంద్రనిర్వహకుడు రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

డీలర్లు స్టాక్ రిజిస్టర్లు పాటించాలి

దోమకొండ, మే23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను ఏవో మణిదీపిక శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైందని, రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని దుకాణ నిర్వాహకులను సూచించారు. డీలర్లు స్టాక్ ఎంట్రీ కోసం రిజిస్టర్లను నిర్వహించాలని, విత్తనాల కంపెనీ వివరాలు, విత్తనాల పీపీలు, ఇన్వాయిస్‌లు పెట్టుకోవాలన్నారు. రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని, సరైన ధరలకు, నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. రైతులు ప్యాకింగ్ లేని విత్తనాలను కొనుగోలు చేయవద్దని చెప్పారు. లైసెన్స్ పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

సైనిక్ స్కూల్ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినికి సన్మానం

బీర్కూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ ఉన్నత పాఠశాలకు చెందిన వైష్ణవి అనే విద్యార్థిని ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించి అర్హత సాధించింది. ఈ మేరకు బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ వెంకన్న విద్యార్థినికి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగపరమేశ్వర రావు, పాఠశాల కరస్పాండెంట్ కొర్రి శేఖర్ యాదవ్, పాఠశాల ఉపాధ్యా యుడు హనుమంత్‌రావు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు.



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

● ఎంపీడీవో సూర్యకాంత్

నసురుల్లాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంకోల్, నెమలి, అంకోల్ తండా గ్రామాలలో అధికారులు, లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలకు కలిపి మొత్తం 320 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసుకొని ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని అన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టిన తర్వాత విడుతల వారీగా బిల్లులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటరమణ, హౌసింగ్ ఎఈ నసీమ, పంచాయతీ సెక్రెటరీలు హనుమవ్వ, రజిత, గ్రామస్థులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి యోగా దశాబ్ది వేడుకలు

కామారెడ్డి టౌన్, మే23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయూష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే థీమ్‌తో ఈనెల 27 నుంచి జూన్ 21 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లాప్రోగాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. హరిత యోగా, యోగా సమావేశం, యోగా వాక్, యోగా సంగమం, యోగా ప్రభావ అనే కార్యక్రమాలు నాలుగు వారాలపాటు గ్రామ, మండలస్థాయిలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్యమందిరాల మెడికల్ ఆఫీసర్‌ల పర్యవేక్షణలో యోగా శిక్షకుల చేత నిర్వహించబడుతాయని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారంచేస్తూ అందరిని భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

మొరాయించిన ఎలక్ట్రిక్ బస్సు

● బస్సులో సాంకేతిక లోపం ● మార్గం మధ్యలోనే ఆగిపోయిన వాహనం ● ఆందోళనకు గురైన ప్రయాణికులు

నిజాంసాగర్, మే23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల్లో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. మార్గమధ్యంలోనే బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. నిజామాబాద్ డిపో నుంచి వయా నిజాంసాగర్ ఎల్లారెడ్డి మెదక్ మీదుగా మూడు నెలలుగా ఎలక్ట్రిక్ బస్సును హైదరాబాదుకు నడుపుతున్నారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సులు నిజాంసాగర్ మీదుగా రెండేసి సర్వీసులు నడుస్తూ ఉంటాయి. నిజాంసాగర్ బస్ స్టేషన్ పరిధిలోని సుల్తాన్ నగర్ శివారులో ప్రధాన కాలువ సమీపంలో క్రాసింగ్ వద్ద నిజామాబాద్‌కి వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సులో శుక్రవారం సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో బస్సు నడిపే డ్రైవర్ ఎలక్ట్రిక్ బస్సును పక్కకు నిలిపివేశారు. ఎలక్ట్రిక్ బస్సుల్లో సాంకేతిక లోపాలు ఏర్పడితే డ్రైవర్లకు ఎలాంటి అవగాహన లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిజామాబాద్ డిపోకు చెందిన బస్సు ఉదయం నిజాంసాగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో నిజామాబాద్‌కు వెళుతూ ఉన్న సమయంలో ఆర్టీసీ బస్సుకు సాంకేతిక లోపాలు ఏర్పడ్డాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు పక్కకు నిలిపివేయడంతో ప్రయాణికులు వేరే బస్సుల కోసం వేచి చూస్తూ ఉన్నారు. ప్రధాన కాలువ క్రాసింగ్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఎదురెదురుగా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



నిజాంసాగర్ ప్రధాన కాలువ వద్ద ఆగిపోయిన బస్సు

108, 102 సేవల పరిశీలన

కామారెడ్డి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో 108, 102 అత్యవసర సేవల పనితీరుతో పాటు రికార్డుల ను రాష్ట్రస్థాయి అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ ఆర్ కిరణ్ కిషోర్, రవీందర్ మాట్లాడుతూ 108, 102 సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ జనార్థన్, జిల్లా మేనేజర్ తిరుపతి, సిబ్బంది స్వామి, అనిల్, విజయ్, కృష్ణస్వామి, కార్తిక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సరస్వతీ దేవి ఆలయంలో భక్తుల పూజలు

బాన్సువాడ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు కాశీ సంతోష్‌శర్మ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి సరస్వతీ దేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

మారని తీరు.. అవే వసూళ్లు!

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటూ దొరికాడు. ఇలా నాలుగు నెలల వ్యవధిలోనే పోలీసుశాఖకు చెందిన నలుగురు పోలీసులు పట్టుబడడం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వశాఖలపై ఏసీబీ నిఘా

జిల్లాలోని పలు ప్రభుత్వశాఖలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు తెలుస్తుంది. ప్రధానంగా రెవెన్యూ,మున్సిపల్, పోలీసు,పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖల్లో పలువురిపై అవినితి ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు వెళ్తున్నట్లు సమాచారం. గతంలో ఇవే శాఖల నుంచి పలువురు అధికారులు,సిబ్బంది లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా ఏసీబీ అధికారుల దాడులను చూస్తే ప్రభుత్వశాఖలపై అవినీతి నిరోధక శాఖ నిఘా పెట్టినట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు, పోలీసులు

షీ టీంపై మహిళలకు అవగాహన

నసురుల్లాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండలంలోని కొచ్చేరి మైసమ్మ ఆలయం వద్ద శుక్రవారం షీ టీం అందిస్తున్న సేవలపై కళాజాత బృందం ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించింది. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం, షీటీం సభ్యులతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బృందం సభ్యులు తెలిపారు. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయో వివరించి నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930 కాల్‌చేసి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వేసవి సెలవుల్లో జరిగే దొంగతనాలను నివారించుటకు అత్యవసర సమయంలో మహిళలకు ఎవరైనా ఇబ్బంది గురి చేస్తే వంద నెంబర్ కి కాల్ చేయాలని, మహిళల కోసం షీ టీం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు అనిల్, ప్రియాంక, కళాబృందం సభ్యుడు ప్రభాకర్, నసుల్లాబాద్ పోలీస్ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

బీర్కూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంఎల్‌ఏ రవీందర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. శుక్రవారం ఆయన బీర్కూర్ మండలం దామరాంచ గ్రామంలోని డీసీసీబీ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోడానికి కలిసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, నాయకులు నందు పటేల్, దివిటి శ్రీనివాస్, మంత్రి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ ఏఎస్సైకి ఎస్సైగా పదోన్నతి

పెద్దకొడప్‌గల్, మే23 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాములుకు ఎస్సైగా పదోన్నతి లభించింది. ఇటీవల జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఏఎస్సైగా విధులు నిర్వహించిన 11మందిలో రాములు ఒకరు. గత కొద్దిరోజుల కిందట ఎస్సై శిక్షణ పూర్తి చేసుకున్నారు. పదోన్నతి పొందిన సందర్భంగా రాములకు బిచ్కుంద సీఐ నరేష్ పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

● విజిలెన్స్ అధికారులు

బీర్కూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం విజిలెన్స్ అధికారులు బీర్కూర్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డులు, విత్తనాల విక్రయాలు, అనుమతి, కంపెనీ గుర్తింపు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోస పోవద్దన్నారు. లైసెన్స్ కలిగి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. పంటవచ్చే వరకు విత్తనాల బిల్లులు భద్రపరుచుకుని ఉంచుకోవాలన్నారు. దుకాణం యజమానులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రత్నం, నర్సింగ్‌లు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జుక్కల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలాస్‌కోట ప్రాంతం డోన్గాం గ్రామానికి చెందిన మంగలి బసవయ్య చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బసవయ్య నిజామాబాద్‌లో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవల మద్యానికి బానిసై ఇంట్లో నుంచి రెండు రోజుల క్రితం కనబడకుండా వెళ్లిపోయి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం పశువుల కాపర్లు శవానికి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు జుక్కల్ ఎస్సై తెలిపారు.



చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

